Hero GFT Grand Indian Festival of Trust | Exciting Benefits | EXCHANGE BENEFIT UP TO ₹5000 | LOAN@ 0% INTEREST

నిధుల మళ్లింపుపై గర్జించిన సర్పంచులు

- కమిషనర్ కార్యాలయం ముట్టడికి యత్నం

ఈనాడు-అమరావతి, న్యూస్‌టుడే-తాడేపల్లి: పార్టీలకు అతీతంగా సర్పంచులు కదం తొక్కారు. పోలీసుల ఆంక్షలను తప్పించుకొని రోడ్లపైకి వచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మళ్లించిన 15వ ఆర్థిక సంఘం నిధులు వెంటనే పంచాయతీల బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని గర్జించారు. నిధులు ఇవ్వాలని, లేదంటే సర్పంచి పదవులను రద్దుచేయాలని అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇన్నాళ్లూ ఓపిక పట్టామని, ఇక తాడోపేడో తేల్చుకుంటామని ఆగ్రహోదగ్రులయ్యారు. తాడేపల్లిలోని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కార్యాలయం ముందు శుక్రవారం కనిపించిన వాతావరణమిది. గ్రామ పంచాయతీలకు కేంద్రం కేటాయించిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.948 కోట్లను విడుదల చేయాలన్న డిమాండుతో పలు జిల్లాల సర్పంచులు కమిషనర్ కార్యాలయం ముట్టడికి శుక్రవారం యత్నించారు. ఒకరోజు ముందే సర్పంచుల సంఘం పిలుపునివ్వడంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల సర్పంచులు కార్యక్రమానికి హాజరుకాకుండా పోలీసులు ఆంక్షలు విధించారు. కమిషనర్ కార్యాలయానికి ఇతరులెవరూ వెళ్ల

పంచాయతీరాజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణకు తమ సమస్యలు వివరిస్తున్న సర్పంచులు

కుండా బందోబస్తు ఏర్పాటుచేశారు. పలు జిల్లాల నుంచి తాడేపల్లి చేరుకున్న సర్పంచులు శుక్రవారం ఉదయం 11 గంటల తర్వాత కమిషనర్ కార్యాలయానికి చేరుకున్నారు. తమ డిమాండ్లతో కూడిన నినాదాల ప్లకార్డులతో ఆందోళనకు దిగారు. వీరిని పోలీసులు చుట్టుముట్టడంతో కాసేపు ఉద్రిక్తత తలెత్తింది. ఈలోగా పంచాయతీరాజ్‌శాఖ ఉప కమిషనర్లు డి.సత్యనారాయణ, నాగార్జునసాగర్, గణాంకాధికారి వీరాంజనేయులు వచ్చి సర్పంచులతో మాట్లాడారు. సర్పంచులు మూకుమ్మడిగా అధికారులతో వాగ్వాదానికి దిగారు. సమస్యలపై వినతిపత్రం ఇస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని అధికారులు చెప్పారు. బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేసేవరకూ కదిలేది లేదని సర్పంచులు పట్టుబట్టారు. పోలీసులు వారిని తరలించే ప్రయత్నం చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్తత ఏర్పడింది. పలు వాహనాల్లో మంగళగిరి స్టేషన్‌కు తీసుకెళ్లి 32 మందిని అరెస్టుచేసి, తర్వాత విడుదల చేశారు. అనంతరం సర్పంచులంతా అక్కడే అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అరెస్టయిన సర్పంచులను సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు మంగళగిరిలో కలిసి పార్టీ తరఫున సంఘీభావం ప్రకటించారు.

నిధులు కేటాయించకపోతే త్వరలో సీఎం ఇల్లు ముట్టడిస్తాం

'15వ ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు ఇప్పటికైనా కేటాయించకపోతే త్వరలో సీఎం ఇల్లు ముట్టడిస్తాం. న్యాయమైన డిమాండ్ల సాధనకు అవసరమైతే పదవులకు రాజీనామా చేయడానికైనా వెనకాడేది లేదు. శాంతియుత వాతావరణంలో సమస్యలు చెప్పుకోడానికి వచ్చిన సర్పంచులను అరెస్టు చేయడం అన్యాయం.'

– గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల సర్పంచుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ పాపారావు

బోనులో నిలబెట్టాల్సింది ప్రభుత్వాన్నే

'బోనులో నిలబెట్టాల్సింది.. కేంద్రం కేటాయించిన నిధులను తమ పంచాయతీలకు ఇవ్వాలని అడుగుతున్న సర్పంచులను కాదు, నిధులు దారి మళ్లించిన రాష్ట్ర ప్రభుత్వాన్నే. స్థానిక సంస్థలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. పంచాయతీలకు సమాంతరంగా సచివాలయాలను తీసుకొచ్చి సర్పంచులకు అధికారాలు లేకుండా చేసింది. విద్యుత్తు ఛార్జీలు, పారిశుద్ధ్య కార్మికుల వేతనాలను ప్రభుత్వమే చెల్లించాలి. సర్పంచుల సమస్యలు పరిష్కరించకుండా వారిని అరెస్టు చేయడం అన్యాయం.'

– సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు

సర్పంచుల అరెస్టు దుర్మార్గం

'చట్టబద్ధంగా రావలసిన నిధులను పంచాయతీలకు కేటాయించాలని శాంతియుత వాతావరణంలో ఆందోళన చేస్తున్న సర్పంచులను అరెస్టు చేయడం దుర్మార్గం. కేంద్రం కేటాయించిన ఆర్థిక సంఘం నిధులు పంచాయతీల బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని ప్రభుత్వాన్ని చాలాసార్లు కోరాం. పంచాయతీల్లో నిధుల కొరతతో సర్పంచులు చిన్న చిన్న పనులూ చేయలేకపోతున్నారు. న్యాయంగా రావల్సిన నిధులను ఇప్పించాలని అడిగిన సర్పంచుల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం'

– అఖిలభారత పంచాయతీ పరిషత్ జాతీయ కార్యదర్శి జె.వీరాంజనేయులు

పంచాయతీలకు మళ్లీ షాక్

(మొదటి పేజీ తరువాయి)

ఆ నిధులు ఇప్పుడు ఏమవుతాయన్నది ప్రశ్నార్థకంగా ఉంది. వీటిని ఆయా స్థానిక సంస్థల బ్యాంకు ఖాతాల్లో వేయాలా? పీడీ ఖాతాల్లోనే జమ చేయాలా? అనేది ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.

బ్యాంకు ఖాతాలు తెరిపించి ఏం లాభం?

కేంద్ర ప్రభుత్వం గత రెండు నెలల్లో రెండు విడతలుగా మొత్తం రూ.948.34 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామ పంచాయతీలకు విడుదల చేసింది. ఆర్థిక సంఘం నిధులు గ్రామ పంచాయతీలకు నేరుగా జమ అయ్యేలా బ్యాంకు ఖాతాలను కేంద్ర ప్రభుత్వం తెరిపించింది. ఆర్థిక సంఘం నిధుల్లో పంచాయతీలకు 70%, మండలపరిషత్తులకు, జిల్లా పరిషత్తులకు తలో 15% చొప్పున ఇవ్వాలి. కానీ, ఈ నిధులన్నీ మళ్లీ రాష్ట్ర ఆర్థిక శాఖ ఆధ్వర్యంలోని సమగ్ర ఆర్థిక నిర్వహణ వ్యవస్థ (సీఎఫ్ఎంఎస్)కు అనుసంధానించిన గ్రామ పంచాయతీల పీడీ ఖాతాలకు జమ అయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం కొద్ది రోజులుగా ఏర్పాట్లు చేయడంతో సర్పంచులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. పంచాయతీల బ్యాంకు ఖాతాలకు ఆర్థిక సంఘం నిధులు జమ చేయాలని వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేస్తున్నారు. అయినా ఒక విడత విడుదలైన రూ.379.34 కోట్ల ఆర్థిక సంఘం నిధులు ఆయా పీడీ ఖాతాల్లో జమ అయ్యేలా పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ కోన శశిధర్ పేరుతో గత నెల 28న ఉత్తర్వులు వెలువడ్డాయి. అక్టోబరు 1 నుంచి 14 వరకు రెండు వారాలపాటు వ్యక్తిగత కారణాలతో శశిధర్ సెలవులో వెళ్లారు. ఆయన స్థానంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సీఈవో ఇంతియాజ్‌కి పీఆర్ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ 28నే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది ఉత్తర్వులు జారీ చేశారు.

మే నెలాఖరుకల్లా రోడ్లు బాగు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

విజయవాడలో అంబేద్కర్ పార్కుకు వెళ్లే రోడ్లను అందంగా తీర్చిదిద్దండి. తర్వాత విశాఖలో సుందరీకరణ పనులు చేపట్టాలి.

- జగనన్న కాలనీల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయాలి. పెద్ద కాలనీల నిర్మాణం పూర్తవుతున్న కొద్దీ ప్రాధాన్యక్రమంలో నీరు, మురుగు కాల్వలు, విద్యుత్ సదుపాయాలు కల్పించాక మురుగునీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయాలి.
- జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ కింద ప్రతి నియోజకవర్గంలో ఓ లేఅవుట్‌ను తీర్చిదిద్దాలి. దీనిపై జిల్లాల వారీగా కలెక్టర్లతో సమీక్షించి, ప్రత్యేక దృష్టి సారించాలి.
- వైఎస్ఆర్ చేయూత కింద లబ్ధి పొందుతున్న మహిళలు, ఆ డబ్బుతో స్వయం ఉపాధి పొందేలా చర్యలు తీసుకోండి. వారికి స్వయం ఉపాధి మార్గాలు చూపించి, సంపూర్ణ సాధికారతకు కృషి చేయండి.

ఫ్లెక్సీ తయారీదారులకు రుణాలిప్పించండి

ప్లాస్టిక్ ఫ్లెక్సీలను రాష్ట్ర ప్రభుత్వం నిషేధించినందున దీనిని సంపూర్ణంగా అమలు చేసేందుకు సంబంధిత వ్యాపారులతో కలెక్టర్లు సమావేశాలు నిర్వహించాలి. వాళ్లు ప్లాస్టిక్ నుంచి వస్త్ర బ్యానర్ల వైపు మళ్లేలా కావాల్సిన ఆర్థిక వనరులను సమకూర్చుకునేందుకు తోడుగా నిలవండి. అవసరమైతే రుణాలు ఇప్పించండి. సకాలంలో తిరిగి చెల్లించే వారికి ప్రభుత్వం నుంచి వడ్డీ రాయితీ కల్పించేలా అధికారులు ఆలోచన చేయండి' అని అధికారులకు నిర్దేశించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు పొందినవారికి అభినందన

స్వచ్ఛ సర్వేక్షణ్-2022లో 11 అవార్డులు గెల్చుకున్న తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ, శ్రీకాకుళం కార్పొరేషన్ మేయర్లు, డిప్యూటీ మేయర్లు, కమిషనర్లు పులివెందుల, పుంగనూరు, పొదిలి, సాలూరు మున్సిపాల్టీల ఛైర్మన్లు, వైస్‌ఛైర్మన్లు కమిషనర్లు, ఇతర అధికారులను సీఎం అభినందించారు.

'498ఏ' దుర్వినియోగం అవుతోంది

- ఆయుధంగా వినియోగిస్తున్నారని హైకోర్టు ఆందోళన

ఈనాడు, అమరావతి: భారత శిక్షాస్మృతి(ఐపీసీ)లోని సెక్షన్ 498ఏ దుర్వినియోగం అవుతోందని హైకోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. నిరాధార ఆరోపణలతో భర్త, ఆయన కుటుంబ సభ్యులను సులువుగా వేధించేందుకు, అరెస్ట్ చేయించేందుకు 498ఏను వినియోగిస్తున్నారని ఆక్షేపించింది. ఈ సెక్షన్‌ను మహిళలు రక్షణ కవచంగా కాకుండా... ఆయుధంగా వినియోగిస్తున్నారని, కుటుంబంలో లెక్కలు తేల్చుకునేందుకు వాడుతున్నారని ఘాటుగా వ్యాఖ్యానించింది. స్వల్ప కారణాలతోనే ఫిర్యాదులు చేస్తున్నారని, ప్రస్తుతం వైవాహిక వివాదాలు పెరిగిపోతున్నాయని గుర్తుచేసింది. ఈమేరకు ఓ వ్యక్తి కుటుంబ సభ్యులపై నమోదు చేసిన 498ఏ కేసును కొట్టేసింది. ఫిర్యాదులో పేర్కొన్నవన్నీ నిరాధార ఆరోపణలని స్పష్టంచేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాస రెడ్డి ఇటీవల ఈ తీర్పు ఇచ్చారు. కట్నం కోసం వేధిస్తూ, క్రూరత్వానికి పాల్పడుతున్నారనే ఆరోపణలతో మాచర్లకు చెందిన నూర్జహాన్... భర్త, ఆయన సోదరులు, సోదరుల భార్యలు, అత్తమామలు తదితరులపై 2020లో ఫిర్యాదు చేయగా పోలీసులు 498ఏ కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఈ కేసుపై దిగువకోర్టులో విచారణ జరుగుతోంది. తమపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ నూర్జహాన్ తోడికోడళ్లు, వారి భర్తలు హైకోర్టులో వ్యాజ్యం వేశారు. విచారణ జరిపిన న్యాయమూర్తి... ఆధారాలు లేని కారణంగా పిటిషనర్లపై పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేస్తూ తీర్పు ఇచ్చారు.

విద్యుత్తు బకాయిల చెల్లింపులో మాయాజాలం

'ఈనాడు'తో పలు పార్టీల సర్పంచులు

ఈనాడు, అమరావతి: ఆర్థిక సంఘం నిధులను పంచాయతీల విద్యుత్తు బకాయిల కింద ప్రభుత్వం చెల్లిస్తోందనడంలో నిజం లేదని పలువురు సర్పంచులు అభిప్రాయపడ్డారు. అలా చెల్లిస్తే బకాయిల మొత్తం తగ్గకపోగా, ఇంకా ఎక్కువ ఎందుకు చూపిస్తోందని.. అంటే ఏదో మాయ ఉందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిధులు లేక పంచాయతీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయంటున్నారు. తాడేపల్లిలోని పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడికి వచ్చిన సర్పంచులు 'ఈనాడు'తో మాట్లాడారు. వివరాలు వారి మాటల్లోనే...

బకాయిలు చెల్లిస్తే సరఫరా ఎందుకు నిలిపేస్తున్నారు?

'ఆర్థిక సంఘం నిధులను పంచాయతీల విద్యుత్తు ఛార్జీల బకాయిల కింద చెల్లిస్తున్నామని చెబుతున్నారు. అలా చెల్లిస్తే... అధికారులొచ్చి విద్యుత్తు సరఫరా ఎందుకు నిలిపివేస్తున్నారు? కేంద్రం కేటాయించిన ఆర్థిక సంఘం నిధులను పంచాయతీల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తే బకాయిలు మేమే దశలవారీగా చెల్లిస్తాం కదా.'

– చేపరకొండ రాము, వైకాపా సర్పంచి, అమృతలూరు, బాపట్ల జిల్లా

తీర్మానం చేసేలోపే మళ్లించారు

'మా చిన్న పంచాయతీకి ఆర్థిక సంఘం నిధులొచ్చేది అంతంత మాత్రమే. వీటితో చిన్న చిన్న పనులైనా చేద్దామని తీర్మానం చేద్దామనుకునేలోగా 15వ ఆర్థిక సంఘం 2021-22 తొలి విడత విడుదలైన రూ.14 లక్షలు మళ్లించారు. పంచాయతీల్లో నిధులేక ఏడాదిగా వీధులు, కాలువలు శుభ్రం చేసే కార్మికులకు జీతాల్లేవు. వీధిదీపాలు కూడా వేయించుకోలేని పరిస్థితుల్లో ఉన్నాం.'

– కె.మొషియో, సీపీఎం సర్పంచి, టోకూరు, అల్లూరి సీతారామరాజు జిల్లా

పంచాయతీల్లో పరిస్థితి అత్యంత దయనీయం

'గ్రామ పంచాయతీలను రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టేసింది. కార్మికులకు జీతాలివ్వకపోతే వారితో పనులేలా చేయించుకుంటాం. ఆర్థిక సంఘం నిధులతో రూ.4 లక్షల పనులు చేయించాం. నిధుల మళ్లింపుతో బిల్లులు చెల్లించలేదు. పెట్టుబడులు ఇంకా ఎక్కడి నుంచి తెస్తాం?'

– డి.రాముడు, సీపీఎం సర్పంచి, గొల్లమందల తండా, ఎన్టీఆర్ జిల్లా

పనులు చేసి అప్పులపాలయ్యా

'నాలుగు పనులు చేసి మంచిపేరు తెచ్చుకోవాలనుకున్నాం. ప్రభుత్వాన్ని నమ్మి నిండా మునిగిపోయాం. గ్రామాల్లో పనులు చేసి బిల్లులు రాక అప్పుల పాలయ్యాం. ఇంట్లో బంగారు వస్తువులు తనఖా పెట్టి తీసుకున్న రుణాన్ని సకాలంలో తీర్చనందుకు బ్యాంకులు నోటీసులిచ్చాయి. అరికరాకులపైగా భూమి అమ్ముకున్నా. ఇదీ నాకు లభించిన బహుమతి.'

– కె.నరేశ్, జనసేన సర్పంచి, చిలుమూరు, బాపట్ల జిల్లా

కనీస సౌకర్యాలకూ ఇబ్బందులే

'పంచాయతీలో నిధులేక ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడానికీ ఇబ్బందులు పడుతున్నాం. పంపుసెట్ పాడైతే మరమ్మతులు చేయించడానికీ ఆలోచించాల్సి వస్తోంది. రోడ్లు, కాలువలూ శుభ్రం చేయించలేకపోతున్నాం. పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు సరిగా జమ చేయకపోవడమే ఈ దుస్థితికి కారణం.'

– డి.రత్నబాబు, వైకాపా సర్పంచి, పిడపర్రు, గుంటూరు జిల్లా

హక్కుల పరిరక్షణకు 'నోబెల్ శాంతి' సలాం

(మొదటి పేజీ తరువాయి)

జనజీవనం శాంతియుతంగా సాగేందుకు చేస్తున్న విశేష కృషికి గుర్తింపుగా ఆ త్రయాన్ని సంయుక్తంగా అవార్డుకు ఎంపిక చేసినట్లు నార్వేకు చెందిన నోబెల్ కమిటీ ఛైర్‌పర్సన్ బెరిట్ రైస్ అండర్సన్ శుక్రవారం తెలిపారు.

ఉద్యమవీరుడు బియాలియాట్స్కి

బెలారస్‌లో 1980ల్లో ప్రజాస్వామ్య ఉద్యమాన్ని చురుగ్గా నడిపించిన నాయకుల్లో బియాలియాట్స్కి ఒకరు. మానవహక్కులు, పౌర స్వేచ్ఛపై ప్రజల్లో అవగాహన పెరిగేలా ఆయన విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. తమ దేశంలో నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పదేపదే గళమెత్తారు. హ్యూమన్ రైట్స్ సెంటర్ వియాస్నా అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి.. 'ప్రత్యామ్నాయ నోబెల్'గా పిలుచుకునే 'రైట్ లైవ్లీహుడ్ అవార్డు'ను 2020లో గెల్చుకున్నారు. బెలారస్ అధ్యక్షుడిగా అలెగ్జాండర్ లుకషెంకో తిరిగి ఎన్నికవడాన్ని నిరసిస్తూ అదే ఏడాది ఆందోళనలు చెలరేగగా.. పోలీసులు బియాలియాట్స్కిని నిర్బంధించారు. ఎలాంటి విచారణ జరపకుండా ఇప్పటికీ జైల్లోనే ఉంచారు. వ్యక్తిగతంగా ఎన్ని కష్టాలు ఎదురైనా- మానవహక్కులు, ప్రజాస్వామ్యం కోసం చేస్తున్న పోరాటంలో బియాలియాట్స్కి ఒక్క అంగుళం కూడా వెనక్కి తగ్గలేదని రైస్ అండర్సన్ గుర్తుచేశారు. ఆయన్ను వెంటనే జైలు నుంచి విడుదల చేయాలని నోబెల్ కమిటీ తరఫున పిలుపునిస్తున్నట్లు చెప్పారు. నిజానికి తాజా అవార్డు కారణంగా ఆయనపై బెలారస్ అధికారవర్గాల నిఘా ఇంకా అధికమయ్యే అవకాశాలుంటాయని తమకు తెలుసునని పేర్కొన్నారు. అయితే బియాలియాట్స్కిలో మనోబలం మరింత పెరుగుతుందన్న ఆశతో పురస్కారాన్ని ప్రకటించామని వెల్లడించారు.

పౌర హక్కుల పోరాట గళం.. మెమోరియల్

కమ్యూనిస్టు అణచివేత బాధితులను స్మరించుకునేందుకుగాను ఒకప్పటి సోవియట్ యూనియన్‌లో 1987లో మెమోరియల్ సంస్థను స్థాపించారు. రష్యాలో రాజకీయ ఖైదీల దుస్థితి, మానవహక్కుల దుర్వినియోగం సంబంధిత సమాచారాన్ని అది ఎప్పటికప్పుడు సమీకరిస్తుంటుంది. పౌరహక్కుల పరిరక్షణ కోసం పాటుపడుతుంటుంది. సైనికీకరణను వ్యతిరేకిస్తుంటుంది. చట్టప్రకారం పరిపాలన సాగాలని డిమాండ్ చేస్తుంటుంది.

ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా.. సెంటర్ ఫర్ సివిల్ లిబర్టీస్

ఉక్రెయిన్‌లో మానవహక్కులు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం 2007లో సెంటర్ ఫర్ సివిల్ లిబర్టీస్ అవతరించింది. ఉక్రెయిన్‌ను పూర్తిస్థాయి ప్రజాస్వామ్య దేశంగా మార్చడం, పౌర సమాజాన్ని బలోపేతం చేయడం వంటి లక్ష్యాలు విధించుకొని పోరాడింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో తమ దేశంపై రష్యా ఆక్రమణకు దిగి నప్పటినుంచీ పుతిన్ సేనల యుద్ధ నేరాల సంబంధిత వివరాలను సంస్థ సమీకరిస్తోంది.

పుతిన్‌కు సందేశమేమీ కాదు: రైస్ అండర్సన్

ఉక్రెయిన్‌లో యుద్ధం కొనసాగుతుండగా.. సరిగ్గా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ 70వ పుట్టినరోజున రష్యా, ఉక్రెయిన్, బెలారస్‌లకు చెందిన త్రయానికి నోబెల్ శాంతి బహుమతిని ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ప్రకటనను పుతిన్‌కు సందేశంగా భావించొచ్చా అని రైస్ అండర్సన్‌ను విలేకర్లు ప్రశ్నించారు. దీంతో ఆమె స్పందిస్తూ.. తమకు అలాంటి ఉద్దేశమేమీ లేదని స్పష్టం చేశారు. ఆయా వ్యక్తులు/సంస్థలు చేసే కృషికి గుర్తింపుగా తాము అవార్డును అందజేస్తుంటామని, అంతేతప్ప ఎవరో ఒకరికి వ్యతిరేకంగా కాదని చెప్పుకొచ్చారు. అయితే రష్యా, బెలారస్‌లలో మానవహక్కుల కార్యకర్తలను అణచివేస్తున్న సంగతి తమకు తెలుసునని పేర్కొన్నారు. మరోవైపు- బియాలియాట్స్కికి నోబెల్ శాంతి పురస్కారాన్ని అందజేయాలన్న కమిటీ నిర్ణయాన్ని బెలారస్ తీవ్రంగా తప్పుపట్టింది.

ఫార్ములా-ఈ రేస్ వెబ్‌సైట్ ప్రారంభం

- లోగో, బ్రోచర్ల విడుదల
- తెలంగాణకు గర్వకారణం: మంత్రి కేటీఆర్

ఫార్ములా-ఇ రేస్ పోటీల బ్రోచర్‌ను విడుదల చేస్తున్న తెలంగాణ మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, చిత్రంలో జయేశ్‌రంజన్ తదితరులు

ఈనాడు, హైదరాబాద్: వచ్చే ఫిబ్రవరి 11న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఫార్ములా-ఈ రేస్‌కు సంబంధించిన వెబ్‌సైట్‌ను తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ శుక్రవారం విద్యుత్ మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి ప్రగతిభవన్‌లో ప్రారంభించారు. లోగోను, బ్రోచర్లను విడుదల చేశారు. ఈ రేస్‌కు ఆతిథ్యం ఇస్తున్న తొలి భారతీయ నగరంగా హైదరాబాద్‌కు అవకాశం దక్కడం తెలంగాణకు గర్వకారణమని కేటీఆర్ ఈ సందర్భంగా అన్నారు. ఈ పోటీల్లో భారత్ నుంచి మహీంద్రా అండ్ మహీంద్రా జట్టుతో పాటు మరో పది దేశాల జట్లకు చెందిన 22 మంది డ్రైవర్లు పాల్గొంటారని తెలిపారు. నెక్లెస్‌రోడ్ నుంచి సచివాలయం వరకు జరిగే రేస్‌ల కోసం రూ.80 కోట్లతో భారీఎత్తున మౌలిక వసతులను సమకూర్చనున్నామన్నారు. ఏటా పోటీలు నిర్వహించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఫిబ్రవరి 6న విద్యుత్ వాహనాల శిఖరాగ్ర సదస్సు, 7న విద్యుత్ బైక్‌ల ర్యాలీ, 8,9 తేదీల్లో విద్యుత్ వాహనాల ప్రదర్శన నిర్వహిస్తామని, 10న పోటీలకు హాజరయ్యే వారి కసరత్తు, 11 తేదీన ఫార్ములా-ఈ రేస్ పోటీలు జరుగుతాయని వివరించారు. పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

© 2022 Ushodaya Enterprises Pvt. Ltd., All Rights Reserved. | Privacy policy | Terms And Conditions | Powered by : Summit |